క్లుప్తంగా

వేంకటేశ్వరుని ఆలయాన్ని సందర్శించిన కేంద్ర బృందం



వాడపల్లి వెంకన్న ఆలయంలో కేంద్ర బృందం పరిశీలన

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల కోసం ప్రసాద్ పథకం కింద రూ.52.46 కోట్లు నిధుల కొరకు గతంలో ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు సంబంధించిన ఇద్దరు సభ్యుల బృందం శనివారం వాడపల్లి గ్రామమంతా పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అవసరాలు కావాలి, వాటికి ఉన్న అవకాశాలు ఏంటి, వ్యర్థాలు ఎలా ఉపయోగించుకోవాలి అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నెల 25న జరిగే సమావేశానికి నివేదిక అందిస్తామని బృందం సభ్యులు తెలిపారు.

పళ్లాలమ్మకు లక్ష చామంతి పూజ



లక్ష చామంతి పూజలో పాల్గొన్న దంపతులు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారికి ఆదివారం లక్ష చామంతి పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పూజల్లో 235 జంటలు పాల్గొన్నారు. పూజ అనంతరం వాకాడ తిరుమలరావు సహకారంతో అన్నసమారాధన జరిగింది.

నాణ్యతతోనే వ్యాపారాభివృద్ధి



అంబాజీపేటలో వినియోగదారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: నాణ్యతా ప్రమాణాలు పాటించి వినియోగదారుల్లో నమ్మకాలు పెంచితే వ్యాపారాభివృద్ధి చెందుతుందని అంబాజీపేట, అయినవిల్లి ఎస్సైలు ఎ.చైతన్యకుమార్, కె.రమేష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట గోఫ్రెష్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిర్వహించిన లక్కీ డ్రాను శనివారం తీశారు. గెలుపొందిన వినియోగదారులకు ఎస్సైల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ పి.శ్రీను, కానిస్టేబుల్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు నలుగురి ఎంపిక

అయినవిల్లి: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)నకు ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.గణేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ప్రతిభా ఉపకార వేతనాలకు వీరు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి ప్రతిభా ఉపకార వేతనాలకు కోసం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అత్యధిక మార్కులతో అర్హత సాధించిన వారిలో మానేపల్లి సాయి ఆశ్రిత, బొక్కా యశ్విన్, యల్లమిల్లి జానకీరామ్, సానబోయిన పుష్కర విఘ్నేష్ ఉన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. వీరికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తుందని తెలిపారు.

కొత్తూరు–వెదురుమూడి రోడ్డులో ట్రాఫిక్‌జామ్



ఓఎన్జీసీ వాహనాల రాకపోకల వల్ల పినపళ్ల వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ఆలమూరు: ఓఎన్జీసీ భారీ వాహనాల రాకపోకల వల్ల కొత్తూరు–వెదురుమూడి రోడ్డులోని పినపళ్ల వద్ద ఆదివారం సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల పంట కాలువలో తీసిన పూడికను రహదారి పక్కన ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ రిగ్‌లకు చెందిన యంత్రాలను భారీ వాహనంలో తరలిస్తున్నారు. అసలే ఇరుకురోడ్డు కావడంతో ఆ భారీ పొడుగు వాహనాల ధాటికి మిగతా వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ రహదారి వెంబడి అనునిత్యం ఓఎన్జీసీకి చెందిన అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆవేదన చెందుతున్నారు.

జగదానందకారకా...

- నేడు అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ
- గ్రామగ్రామాన శ్రీరాముని శోభాయాత్రలు



అంబాజీపేటలో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అంబాజీపేట: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో శ్రీరామ శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామ మంత్రస్మరణతో శోభాయాత్రను మండలంలో నిర్వహించారు. అంబాజీపేట, మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ముక్కామల తదితర గ్రామాల్లో శ్రీరాముని శోభాయాత్రను భక్తులు భారీ మోటారుసైకిల్ ర్యాలీతో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సమయంలో అన్ని రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరిగెల ప్రసాద్, సూదాబత్తుల రాము, వలవల బాబి, తెలగారెడ్డి రాము, గొల్లపల్లి బాబి, పళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షతల పంపిణీ

ఆలమూరు: అయోధ్యలో సోమవారం జరగబోయే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటా రామనామం జపించాలని హరే శ్రీనివాస మహిళ భక్త బృందం విజ్ఞప్తి చేసింది. మండలంలోని సంధిపూడిలో ఆదివారం అయోధ్య శ్రీరామ అక్షతల పంపిణీ జరిగింది. అయోధ్యలో నిర్మితమై సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న భవ్య రామాలయంలో బాల రాముని ప్రతిష్ఠ మహోత్సవాలకు ఆహ్వానిస్తూ



శేఖర్, పాలూరి సత్యానందాలను సన్మానిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

కాపుల వీధి రామాలయం ఆలయ కమిటీ నేతృత్వంలో రామ భక్తులు, భజన బృంద సభ్యులు గ్రామంలో పర్యటించారు. మేళతాళాలతో పల్లకీలో శ్రీరాముని ఊరేగిస్తూ వీధి వీధీ తిరిగి శ్రీరామనామ సంకీర్తన చేస్తూ ప్రతి ఇంటికీ కరపత్రాలు, మహిమాన్విత అక్షతలు వితరణ చేశారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ రోజున ఆధ్యాత్మిక దినంగా పాటించాలని వారు కోరారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఎల్.గన్నవరంలో ఆదివారం రామభక్తులు శ్రీరాముని అక్షతల ఊరేగింపు నిర్వహించారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అక్షతలను ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు పంపిణీ చేశారు. కమిటీ నాయకులు గన్నవరపు అమ్మిరాజు, ఫణి, మేడిది పరంధామయ్య, వేమన సత్తిబాబు, వేమన రామకృష్ణ, గనిశెట్టి ఈశ్వర్, సుభాష్, వేమన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దేశ ప్రజల ఆకాంక్ష అయోధ్య రామమందిరంతో నెరవేరిందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు అన్నారు. ఆదివారం ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ రావులపాలెం ఖండ అధ్యక్షుడు తొగరు



ఎల్.గన్నవరంలో శ్రీరాముని అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు



సంధిపూడిలో అయోధ్య శ్రీరామ అక్షతలు పంపిణీ చేసేందుకు ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

సీతారామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత వానపల్లికి చెందిన ధర్నాల శేఖర్ ప్రతి రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి తన ఆటోలో రామ కీర్తనలతో ప్రజల్లో హిందూ మతంపై చైతన్యం తీసుకువస్తున్నందుకు గాను ఘనంగా సన్మానించారు. అనంతరం అయోధ్య ఉద్యమంలో జిల్లా నుంచి కరసేవకుల్లో ఒకరైన రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందని సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు పాలాటి మాధవ స్వామి, యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా కార్యదర్శి గోలకోటి వెంకటేశ్వరరావు, శేషగిరి, నల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: గ్రామంలో వేంచేసిన షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం సాయి నామస్మరణతో మార్మోగింది. స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేక కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులంతా తమ స్వహస్తాలతో బాబాకు అభిషేకం చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి పాల్గొని అభిషేకం నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఆలయ ప్రాంగణంలో భక్తులతో ప్రత్యేక పూజలు జరిగాయి. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీ చంటిరాజు, జంపన బుజ్జిరాజు, కేఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు, ముదునూరి గంగరాజు, గోపాలరాజు, కనుమూరి సుబ్రహ్మణ్యేశ్వరవర్మ, కోళ్ళ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

స్విమ్మింగ్‌లో ఉచిత శిక్షణ



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో స్థానిక కెనాల్ పక్కన పిల్ల కాలువలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం సామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహేబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్ సౌజన్యంతో చిన్నారులకు ఉచిత స్విమ్మింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మోహిత్ మాట్లాడుతూ దైనందిక జీవితంలో స్విమ్మింగ్ ఒక భాగం అయితే ఫిజికల్ హెల్త్ సాధ్యపడుతుందన్నారు. అనంతరం శిక్షకుడు గడ్డం వెంకట్రావు చిన్నారులకు స్విమ్మింగ్‌లోని మెళకువలు నేర్పారు.

మాకు తెలిసింది ఆదుకోవడమే..



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఆదుకోవడమే మాకు తెలిసిన రాజకీయం.. చెత్త రాజకీయాలతో శునకానందం పొందడమే ప్రతిపక్షాల రాజకీయం అంటూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం పెద్దహరిజనవాడలో అంగన్‌వాడీ టీచర్ కొత్తపల్లి శాంతికుమారి (52) గుండెపోటుతో ఈనెల 19న మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విషయాన్ని తెలుసుకుని అమరావతి నుంచి వచ్చి ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా, తన వంతుగా అన్ని విధాలుగా శాంతికుమారి కుటుంబానికి ఎప్పుడు ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి విషయాన్ని ఓట్ల కోసం ప్రతిపక్షాలు చెత్త రాజకీయాలు చేస్తున్నాయని, ఆఖరికి మృతి విషయాన్ని కూడా రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని జగ్గిరెడ్డి హితవు పలికారు. అంగన్‌వాడీ నియామకాలకు సంబంధించి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉద్యోగాలు ఇప్పించిన ఘనత తన తండ్రి చిర్ల సోమసుందరరెడ్డిదేనని జగ్గిరెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రానికి తండ్రి స్థానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నారని, ప్రతిపక్షాలు కావాలనే అంగన్‌వాడీలను రెచ్చగొట్టి రోడ్డెక్కించారన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా అండగా ఉండే కుటుంబం తమదేనని, కమీషన్లు లేకపోతే అడుగు కూడా ముందుకు వేయని టీడీపీ నేతలు నోటికి వచ్చినట్లుగా విమర్శలు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి గడప తన వారేనన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, శాంతికుమారి కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, జిల్లా ఎస్సీ సెల్ వైఎస్సార్ సీసీ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

శివారు ప్రాంతాలకూ రక్షిత తాగునీటి పంపిణీ



శివకోడులో తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రానున్న వేసవిలో శివారు ప్రాంతాలకు రక్షిత తాగునీరు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం శివకోడు, కడలి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న తాగునీటి ట్యాంకు పనులకు ఎమ్మెల్యే రాపాక భూమి పూజ చేశారు. శివకోడులో ఆర్టీసీ కాలనీలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక తాగునీటి ట్యాంకు నిర్మాణం చేయడంపై స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కడలి పంచాయతీ వద్ద ఉన్న పాత తాగునీటి ట్యాంకు సమీపంలో అదనంగా కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో రక్షిత తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ నిర్మాణం, కొత్త తాగునీటి ట్యాంకుల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు నక్కా రామారావు, చొప్పల గుణనాథ్, రాజోలు పీఏసీఎస్ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, నాయకులు కంచర్ల శేఖర్, గుబ్బల మనోహర్, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం



అప్పనపల్లిలో గోశాలను ప్రారంభిస్తున్న దాత చిన్నయ్య దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో దాత విరాళంతో నిర్మించిన గోశాలను ఆదివారం ప్రారంభించారు. మురముళ్లకు చెందిన చీకట్ల సత్యం, సత్యవతి స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన రూ.6 లక్షల విరాళంతో ఈ గోశాలను నిర్మించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ గోశాలను చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి, చీకట్ల నాగేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోకులంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవుకు పూజలు చేశారు. ఇక నుంచి భక్తులు గోకులంలో గోపూజ చేయించుకునే అవకాశం ఉంటుందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, దాత కుటుంబ సభ్యులు బద్రి యశ్వంత్, లక్ష్మీలాస్య, చీకట్ల సత్యనారాయణ, లక్ష్మీనాగసంధ్య ప్రణయ శ్రీకేష్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు



బి.దొడ్డవరం సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమా

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ పేర్కొన్నారు. పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు ఆదివారం మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లో జరిగాయి. విశ్వకర్మ యోజన పథకంతో పాటు ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కోసమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని సత్ఫలితాలు పొందాలన్నారు. ఆయా సమావేశాల్లో సర్పంచ్‌లు చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, గెడ్డం మంగాలక్ష్మి, గుబ్బల దుర్గ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నాయకులు కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, పసుపులేటి మహలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..



సఖినేటిపల్లి సీఎంఎల్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్ విద్యార్థులు

సఖినేటిపల్లి: స్థానిక సీఎంఎల్ కళాశాలలో ఆదివారం 2003–05 బ్యాచ్ ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న వారంతా అదే కళాశాలలో కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా రోజంతా గడిపారు. అలనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్థిక అవసరాల నిమిత్తం ఓ విద్యార్థినికి వారంతా కలిపి కొంత నగదు విరాళంగా అందజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఓగూరి టాండన్ రాజు, లెక్చరర్ నల్లి రాహేల్‌బాబు, సూపరింటెండెంట్ ఎన్.నరసయ్యలను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అలాగే పాఠాలు నేర్పిన నాటి గురువులను కూడా సత్కరించారు. ఇదిలా ఉండగా పూర్వ విద్యార్థులు ఎన్.సూర్యజ్యోతి, సీహెచ్ రమేష్, ఎన్.సురేష్ కళాశాలలో అడ్మిషన్లకు తగిన కృషి చేస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది.

రాజోలు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో 1969లో ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా బందా సూర్యనారాయణ చొరవతో ఒక చోట సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ, తమ బ్యాచ్‌కి పదో తరగతి పూర్తై సుమారు 55 సంవత్సరాలు అయిందన్నారు. తామంతా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా, రాజకీయ, వ్యాపార వేత్తలుగా స్థిరపడ్డామని తెలిపారు. మరో పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న మాట్లాడుతూ, సంక్రాంతి పండగ పురస్కరించుకుని మద్రాసు, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో స్థిరపడిన స్నేహితులంతా ఏటా ఒక చోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. బిళ్ల కోట సోమేశ్వరరావు స్నేహితులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఎన్.మాధవరావు, మాదాసు మోహనరావు, ఎస్.అచ్యుత రామనాగేశ్వరరావు, నైనాల సీతారామారావు, టీవీఎస్ కృష్ణ, అంగర సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆలమూరులోని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థినులు

ఆలమూరు: 22 ఏళ్ల తరువాత నాటి విద్యార్థినులు కలుసుకున్న దృశ్యం ఆదివారం స్థానికులకు కనువిందు చేసింది. ప్రస్తుతం అనుభవిస్తున్న హోదాను, చేస్తున్న ఉన్నత ఉద్యోగాలను మరచి ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఆలమూరులోని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఈ దృశ్యాలు కనువిందు చేశాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 2002 బ్యాచ్‌కు చెందిన సుమారు 19 మంది విద్యార్థులు పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను, చేసిన చిలిపి అల్లరిని గుర్తు చేసుకుని ప్రస్తుతం చేస్తున్న వృత్తి, ఉద్యోగాలను, వ్యాపారాలను వివరించారు. కొంత మంది విద్యార్థులు సమ్మేళనంలో ప్రసంగిస్తూ ఉద్వేగభరితులయ్యారు. అనంతరం విద్యాబుద్ధులను చెప్పిన నాటి గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. రెండున్నర దశాబ్దాల క్రితం పాఠశాలను విడిచి వెళ్లిపోయిన విద్యార్థులందరికి ఒకే వేదికపై తీసుకువచ్చిన కమిటీ సభ్యులను గురువులు అభినందించారు.